డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

తాగునీటి సరఫరా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మధిర రూరల్, జనవరి 27: మండలంలోని బయ్యారం, చిలుకూరు, నిధానపురం గ్రామాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం పర్యటించారు. బయ్యారం పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని సర్పంచ్ గొర్రెముచ్చు ప్రకాశమ్మ, ఎంపీటీసీ సభ్యుఉ చిలకబత్తిని జయరాజుతో కలిసి ప్రారంభించారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. బయ్యారం–మడుపల్లి మధ్య చెరుకు కట్టను వెడల్పు చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానన్నారు. చిలుకూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులను సర్పంచ్ నిడమానూరి సంధ్యతో కలిసి ప్రారంభించారు. నిధానపురం గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతితో కలిసి ప్రారంభించారు. అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో సోమశేఖరశర్మ, జడ్పీ సీఈవో అప్పారావు, ఆర్డీవో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతకానిలో..

చింతకాని, జనవరి 27: మండలంలోని నాగులవంచ ఉన్నత పాఠశాలలో వంకాయలపాటి వీరయ్య చౌదరి ట్రస్ట్ నిర్మించిన భోజన శాల, తాగునీటి సరఫరా కేంద్రాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం ట్రస్ట్ నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. నాగులవంచలో రైతు వేదికను, చిన్నమండవ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, కోదుమూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవనాన్ని, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను భట్టి విక్రమార్క ప్రారంభించారుప్రారంభించారు.

ముగిసిన 'సృజనోత్సవ్'

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం రూరల్, జనవరి 27: మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సృజనోత్సవ్–2024 కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి.రమేష్, ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం హనుమంతరెడ్డి పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ నవీన్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి రెండేళ్లకోసారి సృజనోత్సవ్ నిర్వహిస్తామన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **ధారావతు శివ**, S/o: **ధారావతు దుడియ్య, వయస్సు** :47సం॥లు, **వృత్తి** : వ్యయసాయం, **నివాసం** : ఇ.నెం. 3-39, సత్యనారాయణపురం గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి :

జిల్లా రిజిస్ట్రారు మరియు జిల్లా పరిషత్, ఖమ్మం, సత్తుపల్లి మండల పరిషత్, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాఖా, బేతుపల్లి గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా, పాకలగూడెం గ్రామపంచాయితీ, సత్యనారాయణపురం గ్రామంలో వున్న సర్వే నెం. 133/13/2/2/1, మింజమలే **డాక్యుమెంట్ నెం. 2430/2023**, విస్తీర్ణము : 484-00 చ॥గ॥ల స్థలములకు హద్దులు : **తూర్పు:** పంచాయితీ C C రోడ్డు - 30 అ॥లు, **దక్షిణము** : ధారావతు కిషోర్- 145 అ॥లు, **పడమర** : రోడ్ 30 అ॥లు, **ఉత్తరము** : ధారావతు మంగయ్య - 145 అ॥లు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ పరీక్ష

14 మంది గైర్హాజరు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 27: జేఈఈ మెయిన్ పరీక్షను ఎన్‌టీఏ అధికారులు శనివారం ఖమ్మం జిల్లాలో నిర్వహించారు. మొత్తం ఐదు కేంద్రాల్లో రెండు సెషన్లలో ఈ పరీక్ష జరిగింది. ఉదయం సెషన్–1లో 796 మంది విద్యార్థులకుగాను 788 మంది విద్యార్థులు హాజరై 8 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్–2లో 796 మంది విద్యార్థులకుగాను 790 మంది విద్యార్థులు హాజరై ఆరుగురు గైర్హాజరయ్యారు. ఈ వివరాలను జిల్లా పరీక్షల కో ఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు

మాట్లాడుతున్న ఏసీపీ హరికృష్ణ, పక్కన సీఐ, సిబ్బంది

మామిళ్లగూడెం, జనవరి 27: నగరంలో అక్రమంగా 5 కేజీల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఖమ్మం పోలీసులు అరెస్టు చేసినట్లు ఖమ్మం ఏసీపీ హరికృష్ణ తెలిపారు. ఖమ్మం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులకు ఆ వివరాలను ఆయన వెల్లడించారు. సీఐ స్వామి ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసులు ఖమ్మంలో శనివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైల్వేస్టేషన్ మార్గంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించినట్లు చెప్పారు. బ్యాగులతో రైలు దిగి ఆటోస్టాండ్ వైపునకు వస్తుండగా పోలీసులు వారి బ్యాగులు తనిఖీ చేశారని, ఆ బ్యాగుల్లో ఎండు గంజాయి లభ్యమైందని తెలిపారు. వారిలో నీలం రాజు (23) అనే వ్యక్తి హుజూరాబాద్ మామిళ్లవాడ కాలనీలో హోటల్ వర్కర్‌గా పని చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మరో ఇద్దరు నిందితులు మైనర్లని చెప్పారు. వీరు ఈ గంజాయిని స్వయంగా తాము వినియోగించడానికి, అలాగే విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. నిందితుడు నీలం రాజు, ఆ ఇద్దరు మైనర్లు కలిసి హుజురాబాద్ నుంచి ఏపీలోని శృంగవరపు కోట వెళ్లి వారికి తెలిసిన వ్యక్తి వద్ద 5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు వివరించారు. హుజురాబాద్‌లో గంజాయి తాగడానికి అలవాటుపడిన వ్యక్తులకు ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారని తమ విచారణలో తెలిందన్నారు. నిందితులు శృంగవరపు కోట నుంచి ట్రైన్‌లో వచ్చి ఖమ్మం రైల్వే స్టేషన్‌లో దిగి ఇక్కడి నుంచి బస్సులో హుజురాబాద్ వెళ్లేందుకు బస్టాండ్‌కు వెళ్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి 5 కేజీల ఎండు గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఖమ్మంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

12 మంది జూదరుల అరెస్ట్..
73 క్యాష్ కాయిన్లు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం

రఘునాథపాలెం, జనవరి 27: ఖమ్మం అర్బన్ పరిధి బాలాజీనగర్‌లో ఓ ఇంటిలో కొనసాగుతున్న పేకాట స్థావరంపై ఖానాపురం హవేలీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ కథనం ప్రకారం.. బాలాజీనగర్‌లోని 15-19-95 నెంబరు గల ఇంటిలో యలమద్ది శంకర్ అనే వ్యక్తి ఆధ్వర్యంలో పేకాట నడస్తున్నట్లు శనివారం పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, ఖానాపురం హవేలీ పోలీసులు ఆ ఇంటిలో తనిఖీలు చేశారు. నగరానికి చెందిన యలమద్ది శంకర్, మండేపూడి సత్యనారాయణ, బల్లు సందీప్, రావూరి శ్రీనివాసరావు, పోటు ప్రసాద్, మండేపూడి నాగేశ్వరరావు, సయ్యద్ పాషా, కిలారు శ్రీనివాసరావు, మంగలి రాజశేఖర్, ముండ్ల దీపక్, దుద్దుకూరి విజయ్, కొప్పెర ఉపేందర్‌రావులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.42,715 నగదు, 73 క్యాష్ కాయిన్స్, 12 సెల్ ఫోన్లు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. 12 మంది జూదర్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బహిరంగ ప్రదేశంలో మద్యపానం.. ఐదుగురిపై కేసు..

రఘునాథపాలెం, జనవరి 27: రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం ఏసీపీ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి ఖానాపురం హవేలీ పోలీసులు పెట్రోలింగ్‌లో చేస్తుండగా ధంసలాపురం బ్రిడ్జి కింద ఐదుగురు వ్యక్తులు మద్యం తాగుతూ కన్పించారు. పోలీసులు వారిని వెంటనే అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, ర్యాష్ డ్రైవింగ్, రాత్రి వేళలో సమయానికి మించి షాపులు తెరవడం, బర్త్‌డేల పేరుతో నడిరోడ్లపై వాహనాలు పెట్టి ప్రజలకు అసౌకర్యం కల్పించడం వంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

అడ్మిషన్ క్యాంపెయిన్

మధిర, జనవరి 27: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, అధ్యాపకులు శనివారం బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. తమ కళాశాలలోని కోర్సులను, సదుపాయాలను విద్యార్థులకు వివరించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు కె.రవికుమార్, జి.అరుణ, శీలం ఇందిర, పి.సుజాత, కె.వీరన్న, ఎస్‌కె.అఫ్రోజ్, ఎం శ్రీనివాసరావు, ఎన్.హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగకుంటే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు టాస్క్‌ఫోర్స్ పోలీసుల కౌన్సెలింగ్

మామిళ్లగూడెం, జనవరి 27: సమాజంలో సత్ప్రవర్తనతో మెలగకుంటే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్య రౌడీషీటర్లను హెచ్చరించారు. ఖమ్మం డివిజన్‌లో 22 మంది రౌడీషీటర్లను టాస్క్‌ఫోర్స్ ఏసీపీ కార్యాలయానికి శనివారం పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మాట్లాడుతూ.. నేరస్తులు తొందర పాటులో ఏ నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రౌడీషీటర్ అనే పదం తమ బిడ్డల భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుందని గ్రహించాలని హితవు చెప్పారు. రౌడీషీటర్లు ఇప్పటికైనా తమ ప్రవర్తనను మార్చుకోకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరి పైనా ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు.

'చెకుముకి' విజేతలకు బహుమతులు

సత్తుపల్లి: బహుమతులు అందుకుంటున్న టాలెంట్ స్కూల్ విద్యార్థులు

సత్తుపల్లి, జనవరి 27: చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల స్థాయి విజేతలకు జనవిజ్ఞాన వేదిక బాధ్యులు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక టాలెంట్ స్కూల్ విద్యార్థులు తన్మయ శ్రీజ, సీహెచ్ రామ్‌తేజ, బొల్లోజు సాత్విక్ సాయి సంపత్.. తృతీయ బహుమతి సాధించారు. కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు అభినందించారు.

కల్లూరులో..

కల్లూరు, జనవరి 27: చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్టును శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈవో దామోదరరావు ప్రారంభించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి, జనవరి 27: మండలంలోని వీ.ఎం.బంజర జడ్పీహెచ్ఎస్‌లో శనివారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ జరిగింది. తెలుగు మీడియం విభాగంలో జడ్పీహెచ్ఎస్ కుప్పెగుంట ప్రథమ, ప్రైవేటు పాఠశాలల విభాగంలో లక్ష్య టాలెంట్ పాఠశాల ప్రథమ బహుమతులు సాధించాయి.

కారేపల్లిలో..

కారేపల్లి, జనవరి 27: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మండలస్థాయిలో ఎంపికైన పాఠశాలలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించిన ఈ టాలెంట్‌టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో కారేపల్లి జడ్పీహెచ్ఎస్ మొదటి, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల రెండో, తెలంగాణ మోడల్ పాఠశాల మూడోస్థానంలో నిలిచాయి. తెలుగు మాధ్యమంలో బాజుమల్లాయిగూడెం జడ్పీహెచ్ఎస్ మొదటి, కేజీబీవీ ద్వితీయ, కారేపల్లి జడ్పీహెచ్ఎస్ తృతీయ, ప్రైవేట్‌లో మాదారం జేడీఏవీ మొదటి, నిర్మల పాఠశాల ద్వితీయ స్థానం సాధించినట్లు నిర్వహణ కమిటీ కన్వీనర్ బి.వెంకటరెడ్డి తెలిపారు.

ఏఎంసీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన మార్కెట్ వ్యాపారులు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 27: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌గా ఉన్నత శ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌ను నగరంలోని హోల్ సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్ కమీషన్ వ్యాపారులు వేర్వేరుగా కలిశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో అసోసియేషన్ నాయకులు గోపిశెట్టి నాగేశ్వరరావు, నాళం సతీశ్ ఆధ్వర్యంలో శనివారం సెక్రటరీని కలిసి పుష్పగుచ్చాలు అందించి వెల్‌కం చెప్పారు. మార్కెట్‌లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమం

వైరాటౌన్, జనవరి 27 : టీఎస్‌జీహెచ్ఎంఎ వైరా శాఖ ఆధ్వర్యంలో శనివారం జీహెచ్ఎస్ వైరాలో సభ్యత్వ నమోదు, డైరీ, క్యాలెండర్ పంపిణీ జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఆర్.వీరస్వామి మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో సబ్జెక్టు కొరత ఉన్నచోట వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఎంఈవోని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, హెచ్ఎం ఎస్‌కె.మార్క్, బి.విజయబాబు, మాధవరావు, మల్లేశ్వరి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సౌతిండియా సైన్స్‌ఫెయిర్‌కు 'రెజొనెన్స్' విద్యార్థులు

రెజొనెన్స్ విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 27: నగరంలోని రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చి సౌతిండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థిని డీ.శ్రీవల్లిని ప్రత్యేకంగా అభినందించారు. సౌతిండియా ప్రదర్శనలో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డీఈవో సోమశేఖరశర్మ, డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్ ప్రసన్నరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్జేసీ జూనియర్ కళాశాలలో వీడ్కోలు వేడుకలు

విద్యార్థినికి మెమెంటో అందిస్తున్న కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 27: నగరంలోని ఆర్జేసీ జూనియర్ కళాశాలలో వీడ్కోలు వేతడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం ఎంబీ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్ విద్యార్థులు ఉత్సాహపూరితంగా గడిపారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి ప్రసంగించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపాళ్లు లక్ష్మీపతి, అలవాల లింగయ్య, ఉపేందర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'నిర్మల్ హృదయ్'లో స్పోర్ట్స్, కల్చరల్ ఫెస్ట్

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 27: ఖమ్మం నిర్మల్ హృదయ్ పాఠశాలలో శనివారం స్పోర్ట్స్, కల్చరల్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన, క్రీడల అధికారి సునీల్‌రెడ్డి, ఖమ్మం అర్బన్ ఎంఈవో శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆనందకరమైన జీవితానికి ఆటలు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన మాస్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నిర్మల్ హృదయ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి, సొసైటీ అధ్యక్షురాలు వంగా శివమ్మ, డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మజ, శ్రావణి పాల్గొన్నారు.

త్రివేణిలో టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు

మోటివేషనల్ స్పీకర్‌ను సన్మానిస్తున్న త్రివేణి పాఠశాల బాధ్యులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 27: ఒత్తిడి తగ్గించి విజయం సాధించే అంశంపై నగరంలోని త్రివేణి పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఖమ్మంలోని ఆ పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ట్రైనర్ శ్రీనాథ్ మాట్లాడుతూ.. విజయం సాధించే సూత్రాలను, ఒత్తిడి తొలగించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం నిరుడు టెన్త్‌లో టెన్ జీపీఏ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, కృష్ణవేణి – త్రివేణి విద్యాసంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీఆర్‌వో మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు సేవ చేయడం గొప్ప విషయం: మంత్రి తుమ్మల

అంధ విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మామిళ్లగూడెం, జనవరి 27: అంధ విద్యార్థులకు సేవ చేయడం గొప్ప విషయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లోని వివిధ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న ఐదుగురు అంధ విద్యార్థులకు చేతన ఫౌండేషన్ సమకూర్చిన ల్యాప్‌ట్యాప్‌లను శనివారం ఆయన ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు.

హెల్త్ సబ్ సెంటర్‌కు మంత్రి తుమ్మల శంకుస్థాపన

రఘునాథపాలెం, జనవరి 27: మండలంలోని మంచుకొండ గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో పాటిస్తూ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రేపటి నుంచి ఓపెన్ డిగ్రీ తరగతులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 27: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రథమ సెమిస్టర్ డిగ్రీ తరగతులు ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ జాకీరుల్లా శనివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 27: ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీఐఈవో రవి బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరి 5లోగా ఖమ్మంలోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పంటల సాగుపై పరిశోధనలు

ముదిగొండ, జనవరి 27: పంట సాగుపై అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం నమూనా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా విద్యార్థులు మండలంలోని సువర్ణాపురం గ్రామంలో రెండు నెలలుగా పరిశోధనలు సాగిస్తున్నారు. సాగులో మెళకువలను.. అధిక దిగుబడికి పాటించాల్సిన పద్ధతులను రైతులకు శనివారం వివరించారు.

అక్రమ నిర్మాణదారులకు నోటీసులు

కారేపల్లి, జనవరి 27 : మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టిన వారికి శనివారం పంచాయతీ కార్యదర్శి యాకలక్ష్మి నోటీసులు జారీ చేశారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో తాత్కాలిక నిర్మాణాలు జరపడం వల్ల వాహనాలను నిలిపేందుకు స్థలం లేకుండాపోయిందని, దీంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. నోటీసులు అందిన 48గంటల్లో స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం 50 మందికి నోటీసులు ఇచ్చినట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

అక్రమ తవ్వకాలపై విచారణ

కూసుమంచి, జనవరి 27: మండలంలోని జీళ్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన దేవాదాయ భూముల్లో మట్టిని అక్రమంగా తవ్వడంపై అందిన ఫిర్యాదుతో తహసీల్దార్ సంపత్ కుమార్ స్పందించారు. ఆ ఆలయ భూములను శనివారం పరిశీలించి వివరాలు సేకరించారు. మట్టిని తవ్విన ప్రదేశాన్ని పరిశీలించారు.

ఇసుక దందాపై కఠిన చర్యలు

తిరుమలాయపాలెం, జనవరి 27: ఇసుక దందాపై కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ యాక్ట్ కేసుల నమోదు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాంప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని ముజాహితిపురం సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్న పాలేరు వాగు ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగసుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అన్నారు. ఆర్ఐ.వీరయ్య, ముజాహితిపురం సర్పంచ్ యాకమ్మ పాల్గొన్నారు.

16న బంద్‌ను జయప్రదం చేయండి

వైరాటౌన్, జనవరి 27: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా కార్యదర్శి జి. రామయ్య పిలుపునిచ్చారు. శనివారం వైరాలోని విక్రమ్‌భవన్‌లో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సత్తుపల్లి టౌన్, జనవరి 27: మున్సిపల్ కార్యాలయంలో శనివారం సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. వివిధ పనులకుగాను బిల్లుల చెల్లింపునకు ఆమోదం తెలిపింది. చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షన జరిగిన ఈ సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

సత్తుపల్లి రూరల్, జనవరి 27: లారీ ఢీకొని యువకుడు మృతిచెందాడు. మండలంలోని బుగ్గపాడు గ్రామస్తుడు సవలం రాము(18), శనివారం బుగ్గపాడు నుంచి ద్విచక్ర వాహనంపై నాగుపల్లి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడు, 108 సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడికి తండ్రి లక్ష్మయ్య, తల్లి జ్యోతి ఉన్నారు.

రెండు పూరిళ్లు, గడ్డివాము దగ్ధం

కల్లూరు, జనవరి 27: మండలంలోని మర్లపాడులో అగ్ని ప్రమాదం జరిగింది. ఆర్ఐ స్టాలిన్ తెలిపిన వివరాలు... మర్లపాడు గ్రామస్తులు మడిపల్